# సావిత్రి అంతరంగం

వీధంతా నిర్మానుష్యంగా ఉంది. మొరిగేకుక్కలు తప్ప ఇతర సంచారమేలేదు. సావిత్రి కిటికీనుంచి రోడ్డువైపు చూస్తూంది. అతను ఈ రోజు వస్తానంటూ ఉత్తరం రాసాడు కాని ఏ రైలుకి వచ్చేది రాయలేదు. ఇప్పటికి ఆఖరి రైలు కూడా వచ్చేసి ఉంటుంది. ఆ రైలుస్టేషను నుంచి ఇల్లు పదిహేను నిముషాల నడక. అందుకే ఏ చిన్న శబ్దం అయినా వినిపిస్తుందేమోనని ఎదురు చూస్తూంది.

నిముషాలు నడుస్తున్నాయి. కాని అతని జాడలేదు. ప్రొద్దుటినించి అన్నమేలేదు ఈ రోజు. ఇక రావొచ్చు ఇక రావొచ్చు అనుకుంటూ రోజంతా గడపివేసింది. ఇక విసిగి పోయింది. ఈ రోజుకి అతను రాడు అంటూ నిర్ధారణ చేసుకుంది. అలా నిర్ధారణ చేసుకోగానే ఏదో కోపం నిస్పృహోయత ఏర్పడ్డాయి. ఇదే నిరీక్షణ తిరిగి రేపు కూడానేమో అనుకోగానే భయంవేసింది.

కాని రేపు వస్తాడన్న గ్యారంటీ ఏంటి? ఈ రెండు నెలల్లో ఇది నాల్గవసారి అతను వస్తానని ఉత్తరం రాసి రాకుండా పోవడం. అతని ఉత్తరం రాగానే అతని గురించి ఎదురు చూడాలి. అలా అతను రాని పక్షంలో అతను రాలేకపోయిన కారణం గురించి అతని ఉత్తరం కోసం ఎదురుచూడాలి. రెండు నెల్లనించి ఎడతెగని ఈ నిరీక్షతో తను చాలా నలిగిపోయింది. ఇక తన దగ్గర బలంకూడా లేదు.

ఇక్కడ పరిస్థితులు కూడా మరీ భయంకరంగా తయారయాయి. రెండు నెలలు మొగదక్షతలేని తన్ను గురించి ఇరుగుపొరుగు అనుమాన పడుతున్నారు. పాత బాకీ ఇవ్వని కారణంగా కొత్తబాకీ కుదరటం లేదు. రెండు నెల్లనుంచీ ఇవాళ రేపు అంటూ అందర్నీ తిప్పుతూంది. ఇవాళ అతను రావచ్చు. రేపు తప్పకుండా రండి అంటూ రేపటికి వాయిదా వేసింది.

రేపు ఇవ్వకపోతే బాగుండదమ్మా అంటూ తేలికగా మాట్లాడారు అందరూ.

వీళ్లందరికంటే తను ఇంటి యజమానిని చూస్తే భయంగా ఉంది. అతని గుబురైన మీసాల్ని చూస్తే తనకు నిద్రపట్టదు. తరచు అతను అద్దెకు రావడం వించి ఈ మధ్య అతనిలో వెకిలితనం చోటు చేసుకుంటుందా అన్న అనుమానం కలగకపోవటం లేదు. అయినా భరించక తప్పదు, తను గుట్టుగా బ్రతకాలంటే.

పరిస్థితులు ఇలా ముదురుతున్నాయి అంటూ ఉత్తరం రాయాలను కుంది ఎన్నోసార్లు, కాని ప్రతీసారి అతని వార్నింగ్ గుర్తుకు వచ్చి ఆ ఉద్దేశాన్ని మార్చుకుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ నీ ఉనికి ఎవ్వరికీ తెలియకూడదు ముఖ్యంగా మా ఇంటి వాళ్లకు. వాళ్లకుగాని తెలిసిందా వాళ్లు ఏమైనా చేసేందుకు సమర్థులు. తను ఎట్టి పరిస్థితుల్లోను అతనికి దూరం కాదలచుకోలేదు. సరే అంది.

తను వంటరిగా అతను ఇచ్చిన అడ్రసు ప్రకారం ఇంట్లో దిగింది. తను దిగిన పదిరోజులకు అతనువచ్చి తనతో వారం రోజులు గడిపి వెళ్లిపోయాడు. అదే మొదలు అదే ఆఖరు. అప్పటి నుంచి రెండు నెలలు దాటిపోయింది. రోజూ నిరీక్షణే.

హాయిగాఉన్న ఊళ్లోఉన్నా బాగుండిపోయేది. పెండ్లి ఇంకా పదిరోజులు ఉందనగా అతను "సావిత్రీ నీకు పెళ్లయినా పర్వాలేదు. మనం ఎవరికంటా పడకుండా చాటుగా ప్రేమిను కుందాం" అన్నాడు.

"ఛీ... మీ మొగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. నా బాధ్యతలన్నీ తల మీద వేసుకోకుండా సంతోషమే పడాలను కున్నారా? అయినా మీరు ఎలా అనుకున్నారు మీరు నా మనస్సులో ఉంటే నేను ఇంకొకర్ని ముట్టుకోనిస్తానని. ప్రతిక్షణం అతను అధికారం చలాయిస్తూంటే నరకయాతన పడుతూ మిమ్మల్ని మరచిపోలేక ఎలా బ్రతకనండీ చెప్పండి?"

"నేనూ మీరు బహుకొద్దిగా అయినా అప్పుడప్పుడు కలుసుకున్నాం అన్న సంగతి కొంతమందికయినా తెలిసిందే. పెండ్లికొడుకు పొరుగూరు వాడు కాబట్టి సంగతి తెలుసుకోకుండా మొదట తాళికట్టి రామరామ ఇదే బయట పడిందనుకోండి అతను నన్నాడే మాటలూ గురి చేసే చిత్రహింసా ఊహించుకోండి మీకు తెలుస్తుంది."

"అయితే ఇప్పుడేం చేయాలంటావు?" అన్నాడు అతను. "నన్ను ఇక్కడి నుంచి మరెక్కడికయినా తీసుకు వెళ్లండి. ఎవ్వరూ తెలియని మీరు నేనూ హాయిగా ఉండచ్చు."

"చూడు సావిత్రీ ఇద్దరు ఒకేసారి కనపడకపోతే అందరూ అనుకుంటారు నీవు నాతో లేచిపోయావని. మా నాన్న సంగతి నీకు తెలియంది కాదు మనిద్దర్నీ వెతికించి యమబాధ పెట్టేస్తాడు. మనం దొరక్కపోయినా తన ప్రతీకారం అంతా నీ కుటుంబం మీద తీర్చుకుంటాడు. మనం చేసిన పనికి నీ కుటుంబం మీద కసి తీర్చుకుంటాడు. మనం చేసిన పనికి నీ కుటుంబం హింసపడడం నేను సహించలేదు."

"మరయితే యేం చేద్దాం అంటారు?"

"బాగా ఆలోచించాలి సావిత్రీ. ముఖ్యంగా మానాన్న నేను నీతోలేచి పోయాను అని అనుకోకూడదు."

"అంతటైము లేదండి. మీ నాన్నగారు ఇటువంటిదేదో ముందే ఊహించి తొందర్లో నా పెళ్లి మరొకరితో జరిపించమని మహా వేధించేస్తున్నారు మా నాన్నగార్ని. మా నాన్న చిన్న స్కూలు టీచరు కాబట్టి అతని మాటను మన్నించడం గురించి తొందర్లో ముహూర్తాలు పెట్టించేస్తున్నారు. ఏదో ఒకటి చేయండి" అంటు ఆతృత పెట్టసాగింది.

"సరే నేను ఈ రోజే ఈ ఊరు విడిచి మరో ఊరువెళ్లి అక్కడ ఇల్లు ఒకటి తీసుకుంటాను. తిరిగి వచ్చి నీకు అడ్రసు, తాళం అప్పచెబుతాను. నీవు పెళ్లికి ముందర అక్కడకు వెళ్లిపో. నేను ఇక్కడే ఉండి నీవు ముహూర్తంవేళకి పారిపోతే నా మీద అనుమానం ఎవరికీ రాకుండా ఉంటుంది. కొన్నాళ్లు మీ వాళ్లు బాధపడ్తారు నీ గురించి. తరువాత అందరూ మరచిపోతారు" అన్నాడు.

దీనికి తను ఒప్పుకుంది.

వారం తిరక్కుండానే అతను వొచ్చి తాళం అడ్రసూ అందించాడు. తను రేపు పెళ్లి అనగా ఇక్కడకు వచ్చివేసింది.

**తల్లీ, తండ్రీ, తన తోబుట్టువులూ మునుపటిలా చూసుకుంటారా? వాళ్లు తిరిగి తన్ను ఇంట్లోకి తీసుకొని — మునుపటిలా చూసుకున్నా ఊరు ఊరు వెలివేయదూ? అనవసరంగా బ్రతుకంతా దుర్భరం చేసుకుంది.**



దినాలు నడుస్తున్నకొద్దీ, రోజులు దుర్భరమవుతున్నాయి. ఇక తనవొక్కరోజు కూడా ఉండలేదు. రేపటికి తన్ను ఏం చేస్తారో వీళ్లంతా ముఖ్యంగా ఆ ఇంటి యజమాని అతను, అతని చులకనైన నవ్వు వాళ్ళ జలదరించిపోతూంది.

తను రాజు దగ్గరకు వెళ్లిపోతుంది. కాని అతను తన మాటను జవదాటి నందుకు కోపించుకొని నిన్ను ఏలుకోను పొమ్మంటే?

తండ్రి దగ్గరకు వెళ్ళిపోతుంది.

అందర్నీ అవమానంచేసి నలుగుర్లో పారిపోయింది — అని పేరుతెచ్చుకున్న తన్ను ఇంట్లోకి రానిస్తారా తిరిగి? తల్లి, తండ్రీ, తన తోబుట్టువులూ మునుపటిలా చూసుకుంటారా? వాళ్ళు తిరిగి తన్ను ఇంట్లోకి తీసుకొని — మునుపటిలా చూసుకున్నా ఊరు ఊరు వెలివేయదూ అనవసరంగా బ్రతుకంతా దుర్భరం చేసుకుంది. ఎవర్ని అనీ ఏమి లాభం ఉంది. అసలు వాడికి బుద్ధిలేనప్పుడు రెండు నెలలు — ఇంటి ప్రక్క తిరిగి చూడకుండా — ఇప్పుడు అప్పుడు అంటూ వాయిదా వేస్తున్నాడే.

శుభ్రంగా తండ్రి చూపెట్టిన సంబంధం చేసుకోకుండా తనెందుకలా తెగించింది? కనీసం సుఖం సంతోషం లేకపోయినా ఇంటిపట్టునే ఉండేది. అయినా ఈ పెద్దలకు ఏంటో అంత పట్టింపులు రాజుతండ్రి భూకామందు అయితే ఏం? తనకూ వాళ్లకూ మధ్య అంతస్తు తేడా ఉంటేనేం? తన తండ్రే అన్నాడు "రాజు చరిత్ర అంత బాగాలేదమ్మా. అతను శ్రీమంతులబిడ్డ. లోగడ

ఎందరితోనో తిరిగాడు. కాని ఎవ్వర్నీ పెళ్లిచేసుకోలేదు వాళ్ల అంతస్తుకు తూగక.'' అని అన్నప్పుడు తను ''నీకు తెలియదు నాన్నా. నా రాజు నన్ను అమితంగా ప్రేమిస్తున్నాడు'' అంది.

తన ప్రేమ ఇంకా ముదిరి తను రాజుచేత మోసగింప బడుతుందేమో అన్న భయంతో తండ్రి గుట్టుగా దూరదేశ సంబంధం కుదిర్చి పెళ్లి చేద్దాం అనుకున్నాడు.

రాజుతో తను మాట్లాడింది తన సంబంధం అనుకోకుండా స్థిరంకాగానే నేను మరే ఊళ్లో అయినా ఇల్లు సంపాదించేవరకు నువ్వు ఈ సంబంధానికి ఒప్పుకున్నట్లే చాలా సంతోషంగా కనపడు. మీ ఇంట్లో వాళ్లు నువ్వు ఈ పెళ్లికి సుముఖంగా లేవని తెలుసుకున్నారో అప్పుడు నీకు స్వేచ్ఛ ఉండదు. నువ్వు నాతో వచ్చేసే అవకాశం కూడా ఉండదు. అందుకే నువ్వు పూర్తిగా మారిపోయినట్లూ, నన్ను మరచిపోయినట్లూ కనపడు అన్నాడు.

సరే అంది.

ఆ రోజునుంచి తను ఇంట్లో వాళ్లతో ఎంతో కలుపుగోలుగా తిరిగింది. అందర్నీ నవ్విస్తూ మాట్లాడింది. ఇంట్లో పెళ్ళిపనులు అన్నీ చకచక జరిగిపోతున్నాయి. శుభలేఖలు అచ్చయాయి. తనకు బట్టలు కొనేసారు. శుభలేఖలు పంచేసారు. పెండ్లి ఇంకా రెండే రోజులు. ఊరెళ్లిన రాజు ఇంకా తిరిగిరాలేదు. తనకేదో భయంగా ఉంది.

తన భయాలను తొలగిస్తూ ఆ రోజు రాత్రి వచ్చేనంటూ వర్తమానం పంపించాడు దాంతో ఎడబాటూ, తాళం.

బంధువులంతా దూరదేశాల నుంచి దిగారు. ఇల్లంతా కళకళ లాడుతూంది.

అంతమందిలో అవమానం చేస్తూ తను ఆ రాత్రి రైలెక్కేసింది.

ఇప్పుడు తండ్రి తన్ను రానిస్తాడా?

ఆలోచించింది రాత్రంతా ఏమీతోచలేదు. తనకు ప్రపంచంలో ఎవరూలేరు తల్లిదండ్రులు తప్ప.

ఎంత తనుచెడ్డా వాళ్ల మమకారం చంపుకోగలరా? తన్ను తప్పకుండా చేరదీస్తారు అనుకుంటూ తెల్లవారు జామునే తన ఊరికి రైలెక్కింది.

కనుచీకటి పడగానే ఊరు చేరింది. ఊరు దిగగానే మొదట తండ్రిని పలుకరించాలన్న కోరిక అణచుకో లేకపోయింది. తను ముఖం ఎవరికీ కనపడకుండా నిండా ముసుగు కప్పుకుని తండ్రి ఇంటికి బయలుదేరింది.

తను ఇల్లు చేరేటప్పటికి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఇంట్లో దీపం మిణుకు మిణుకు మంటున్నది. వీధి గట్టు మీద తండ్రి కనిపించాడు. ఆ మసక వెల్తుర్లో మతి పోయినవాడిలా ఉంది అతని ముఖం.

దగ్గరకు వస్తూనే ''నాన్నా'' అంది పొంగిపొర్లే దుఃఖంతో.

''అమ్మా నీవా?'' అన్నాడు.

''అవును'' అంది కళ్ల వెంబడి నీళ్లు కారుతూంటే.

''ఇంట్లోకి ఒకసారి తొంగి చూసి మీ అన్నయ్యలు, వెల్లాయిలూ అందరూ భోజనం చేస్తున్నారమ్మా వాళ్లు నిన్ను చూడకుండానే '' అంటూ పూర్తి చేయలేక ''రామ్మా అలా నాతో నడు'' అంటూ ఇంటికి దూరంగా నడవసాగాడు.

ఆ వీధికి దూరంగా చిన్నమర్రి చెట్టు ఉంది. దాని క్రింద కూచుంటూ అతనిలో ఉద్వేగం ఆగక ''అమ్మా'' అంటూ కూతురు చేతులు తన చేతిలోకి తీసుకున్నాడు.

''నాన్నా'' అంటూ అతని హృదయం మీదికి ఒరిగిపోయింది.

''నాన్నా నిన్ను విడిచి నేను చాలా అలసిపోయాను నాన్నా. విశ్రాంతి తీసుకొనేందుకు కాస్త చోటివ్వు నాన్నా!'' అంది బాధతో.

''చాలా ఆలస్యంగా అడిగావమ్మా. చాలా ఆలస్యంగా అడిగావు. నువ్వు చేసిన పని హర్షించని వేళలో అడిగావ మ్మా ఈ నోటితో లేదు అని చెప్పలేనని తెలిసేకదూ ఇలా అడిగావమ్మా?'' అన్నాడు కళ్లవెంబడి నీళ్ళు కారుతూంటే.

''నాకు తెల్సునాన్నా ఎవరు కాదన్నా నీవు కాదనవనే అందర్నీ ఎదిరించి అయినా ఇంట్లోకి రానిస్తావనీ...''

''పొరపాటు పడున్నావు తల్లీ నిన్ను తిరిగి కుటుంబంలోకి తీసుకోలేనమ్మా.''

''ఎందుకు నాన్నా నేను పారిపోయాననే కదూ?'' అంది అమాయకమైన బాధతో.

''కాదమ్మా లోకం దృష్టిలో మీ అన్నదమ్ముల దృష్టిలో నువ్వు చనిపోయినవమ్మా! వాళ్లకు ఆ నమ్మకమే కలిగి ఉండకపోతే నా సావిత్రి ఇంకొకడితో లేచిపోయింది అన్న అపవాదు నేను జీవితాంతం భరించలేక పోయేవాడినమ్మా. నీ నడవడి నుంచి నీ చెల్లెళ్ళ భవిష్యత్తు అంధకారమవుతే తండ్రిగా నేను హర్షించేవాడిని కాదమ్మా.''

అలాకాకుండా విధి ఇంతటి కష్టంతో కూడా కొద్దిగా చేయూత నిచ్చిందమ్మా.

నీవు ఇల్లు వొదలిన రెండు గంటల్లోనే అర్థం చేసుకున్నానమ్మా. నీవు చాలా అవివేకం పనిచేసావని. నీవు అంత తొందర్లో ఊరుదాటి ఉండవని నలుగుర్నీ నాలుగు వైపులా పంపాను. నేను పిచ్చిపట్టినవాడిలా కాలువ గట్టు మీదకు వెళ్తుంటే రోడ్డుమీద ఒక యాక్సిడెంట్ శరీరం కనిపించిందమ్మా. ఎవరో లారీవాడు మనిషి మీదనించి తోలేసి పారిపోయాడు. ఆ శవం ఆడది. ఆమె నీలాంటిచీరే కట్టుకుంది. ముఖం గుర్తుకాకుండా పచ్చడి క్రింద నలిగిపోయింది. ఆ శవం చూడగానే అనిపించింది నా కూతుర్ని అపవాదు నేసి అందరూ జీవితాంతం మాట్లాడుకోవడం నేను భరించలేనని. అందుకే అప్పుడే నలుగురి కళ్లలో నిన్ను చంపివేసానమ్మా.

''అందరిని పిలిచి నా కూతురు అంటూ భోరున ఏడ్చాను. మీ అమ్మనీ, మీ అన్నల్ని అందర్నీ దుఃఖితుల్ని చేసేనమ్మా. ఎందుకో తెలుసా నీ గురించి మాటపడలేనని తల్లీ నీ మీద అభిమానమే అలా చేయించింది.''

''నాకు బాగా తెలుసు నీవు తప్పటడుగు వేసేవని. నీకు నా అవసరం ఉండే రోజు వస్తుంది. రోజూ నీ ఆలోచనల్లోనే నిన్ను గురించే కుములుతున్నా నమ్మా. ఈ రెండు నెల్లల్లో అందరూ కూతురు పోయిందని వెర్రెత్తి పోతాననుకున్నారు. అమ్మా కాని నాకుతెలుసు నా అవసరం నా కుతురికి ఎన్నడయినా కలుగొచ్చని. కాని ఇంత తొందర్లో అని అనుకోలేదమ్మా'' అంటూ బావురుమన్నాడు.

తండ్రి తనకు ఒక విధంగా ఉపకారమే చేసాడు. తన ఈ పనినుంచి ఇంకొకరికి తలవంపులు రాకుండా కాపి మరో విధంగా తన్ను ఆ కుటుంబం నుంచి దూరంచేసాడు. తనకు ఈ ఊళ్లో అడుగుపెట్టే అధికారం ఇంక ఎప్పటికీ కోల్పోయింది.

ఇన్నీ పోగొట్టుకున్నా తను రాజుని పొందగల్గింది ఆదే చాలు అదే ఉద్దేశంతో ''నాన్నా! రాజు దగ్గరికి నేను వెళుతున్నా నీవు ఆశీర్వదించి దిగపెట్టు'' అంది.

''వాడా వాడు నీకు వెళ్ళకిందటే చచ్చిపోయాడమ్మా!''

''అంటే?'' అంది.

''ఇక ఆదుర్మార్గుడి గురించి ఎక్కువ అడగక'' అన్నాడు అతన్ని గురించి మాట్లాడటం ఇష్టంలేక.

తన ఊహాకందే ఈ ఒక్క ఆధారం కూడా తెగిపోయింది.

అయితే తను ఏకాకి ఈ ప్రపంచంలో అన్నమాట ''సరేనాన్నా ఇకనేను వెళతాను'' అంది.

''ఏ ఆధారం లేకుండా నిన్ను ఎలా ఒంటరిగా పంపిచను అమ్మా. వీళ్లకందరికీ నీవు చచ్చి పోయావమ్మా. నాకు మాత్రం ఇంకా బ్రతికే ఉన్నావు. పద అమ్మా వీళ్లందరికి దూరంగా నానుంచి నిన్ను ఎవ్వరూ దూరం చేయలేని సీమలలోకి....''

ఇద్దరూ రైల్వేస్టేషను వైపుకు నడక సాగించారు. ★

